రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఇతరులకు ఇస్తే శిక్షార్హులు

జిల్లా రిజిస్ట్రార్ హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల రిజిస్ట్రేషన్లు జరిగాక కక్షిదారులు లేదా వారి నామినీల నుంచి బయోమెట్రిక్ అథెంటికేషన్ చేసినవారికే ఒరిజినల్ డాక్యుమెంట్లను ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చాలాచోట్ల సబ్ రిజిస్ట్రార్లు (ఎస్ఆర్‌లు) నిబంధనలకు విరుద్ధంగా బయోమెట్రిక్ అథెంటికేషన్ లేకుండా ఇతరులకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను ఇస్తున్నట్లు ఐజీ కార్యాలయం పరిశీలనలో గుర్తించారన్నారు. ఇకపై ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఆదేశాలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయని తెలిపారు.

జూలై 5కు లోక్ అదాలత్ వాయిదా

చిత్తూరు లీగల్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను జూలై ఐదో తేదీకి వాయిదా వేస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎంఎస్ భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్, చిట్‌ఫండ్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు.

26 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

చిత్తూరు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న 26 మంది గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులు .. గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీచేశారు.

ఐదు సెక్టోరియల్ పోస్టులకు 42 దరఖాస్తులు

చిత్తూరు సెంట్రల్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ఖాళీలు ఏర్పడిన ఐదు సెక్టోరియల్ పోస్టులకు 42 దరఖాస్తులు వచ్చినట్లు ఏపీసీ వెంకటరమణ తెలిపారు. అసిస్టెంట్ సీఎంవో, రెండు అసిస్టెంట్ ఎస్‌వో, ఎంఐఎస్-ప్లానింగ్ కోఆర్డినేటర్, సహిత విద్య కోఆర్డినేటర్ పోస్టులకు 19 మంది టీచర్ల నుంచి ఈ దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ వివరాలతో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫైల్ పంపుతున్నామని, ఆయన సూచనలతో ఇంటర్వ్యూలు నిర్వహించి, మెరిట్ ఆధారంగా కమిటీ ఎంపిక చేసిన వారికి పోస్టులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నత్తనడకే

● టీడీపీ సంస్థాగత ఎన్నికలపై దృష్టి సారించని ఎమ్మెల్యేలు

చిత్తూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో వున్న పార్టీ పదవులకు సహజంగా మంచి హోదా, గౌరవం దక్కుతుంది.ప్రస్తుతం అధికారంలో వుండడంతో టీడీపీలో పదవుల కోసం పోటీ ఎక్కువగానే వుంది.అయితే జిల్లాలో పార్టీ పదవుల భర్తీ ప్రక్రియ మాత్రం నత్తనడకన సాగుతోంది. ఈ నెల 18వ తేదీలోగా గ్రామ, మండల స్థాయి సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలని టీడీపీ అధిష్టానం నుంచి ఆదేశాలున్నా ఒకట్రెండు నియోజకవర్గాల్లోనే గ్రామ కమిటీల నియామక ప్రక్రియ జరుగుతోంది. కొన్నిచోట్ల అసలు ప్రారంభమే కాలేదు. మండల కమిటీ ఎన్నికలైతే ఎక్కడా ప్రారంభం కాలేదు.

● పార్టీ ఆదేశాలు పట్టని వైనం

ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు కడపలో టీడీపీ వార్షిక పండుగ మహానాడు జరగనుంది. అక్కడ పార్టీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అందుకే ఈ నెల 18లోగా జిల్లాలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలని పార్టీ ఆదేశించింది. ఇటీవల చిత్తూరులో పర్యటించిన ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి కూడా ఎన్నికల్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు.

● గతంలో నిర్మాణాత్మకంగా ఎన్నికలు

గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కొన్ని మండలాల్లో ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. కొన్ని ప్రాంతాల్లో వాయిదా కూడా వేయాల్సి వచ్చింది. ఓ మండలంలో సంస్థాగత ఎన్నికల్ని మరో మండలానికి చెందిన నాయకులు పరిశీలకులుగా వచ్చి నిర్వహించేవారు.గ్రామ సభలు నిర్వహించి, కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుని ఎన్నుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎమ్మెల్యేలు ఎవర్ని ఎంపిక చేస్తే వారే కమిటీలో చోటు దక్కించుకుంటున్నారు. దీంతో ఒక్కోసారి ఎన్నికల్లో కష్టపడి పనిచేసినవారికి అన్యాయం జరిగే అవకాశాలున్నాయని శ్రేణులు వాపోతున్నాయి.ఒకవేళ ఎమ్మెల్యేలు పార్టీ మారితే.. ఆయన నియమించుకున్న మండల, గ్రామ కమిటీ నాయకులంతా వెళ్లిపోయిన సందర్భాలు కూడా వున్నాయి.

● జిల్లా అధ్యక్షుడి పాత్ర ఎంత..?

చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ను ఎమ్మెల్యేలు లెక్క చేయడం లేదనే ఆరోపణలు ఓ వైపుండగా మరో వైపు ఆయన పార్టీని నడిపించలేకపోతున్నారనే విమర్శలు కూడా వున్నాయి. ఇటీవల జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశానికి కూడా ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ రాలేదు. వాస్తవానికి ఈ సంస్థాగత ఎన్నికల్లో జిల్లా పార్టీ అధ్యక్షుడి పాత్ర కీలకం అయినప్పటికీ ఇక్కడ ఆ పరిస్థితి లేదు.

● ఆ రెండు నియోజకవర్గాల్లో పోటీ ఎక్కువ

జీడీ నెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో మండల అధ్యక్ష పదవులకు విపరీతమైన పోటీ ఉందని చెప్పుకోవచ్చు. కుప్పం నియోజకవర్గంలో పోటీ ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు నిర్ణయమే ఫైనల్ కానుంది.

పంచాయతీలకు రూ.1.38 కోట్లు విడుదల

చిత్తూరు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ళ కాలంలో గ్రామ పరిపాలన నిధుల్లేక చతికిలపడింది.ప్రస్తుతం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చొరవతో గ్రామపంచాయతీలకు ఎప్పటికప్పుడు నిధులు విడుదల వుతున్నాయి. స్టేట్ గ్రాంట్‌గా తొలి త్రైమాసికానికి జిల్లాకు రూ.1,38,35,646 నిధులు విడుదల చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న సర్పంచ్‌లకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ఒక్కొక్కరికీ రూ.3వేల చొప్పున మూడునెలలకు గాను రూ.9వేల వంతున రూ.86,95,992 నిధులు విడుదలయ్యాయి. తలసరి ఆదాయం (పర్ కేపిటా గ్రాంట్) రూపంలో రూ.15,05,785 గ్రాంట్ వచ్చింది. వృత్తి పన్ను రూపంలో రూ.36,33,196, గ్రంథాలయ సంస్థ గ్రాంట్‌గా రూ.673 వెరసి రూ.1.38 కోట్లు జిల్లాకు విడుదలయ్యింది. ఈ మొత్తాలను వచ్చే వారం సర్పంచ్‌లకు, గ్రామపంచాయతీల ఖాతాలకు విడుదల చేస్తారని డీపీవో సుధాకర రావు తెలిపారు.

సమ్మర్ క్యాంప్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

చిత్తూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న సమ్మర్ క్యాంపునకు సంబంధించిన క్రీడా కిట్లను ఆయా ఇన్‌చార్జిలు, పీఈటీలు, పీడీలకు పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మెసికల్ మైదానంలో ఈ కార్యక్రమం జరిగింది. రూ.5500 విలువ చేసే క్రీడా పరికరాలను అందజేశారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నాయకులు చెంగల్రాయనాయుడు, జయప్రకాష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

28మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నందాకా ఎండలు మండిపోతున్నాయి.సాయంత్రమయ్యే సరికి వర్షపు జల్లులతో ఆహ్లాద వాతావరణం నెలకొంటోంది. జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 28 మండలాల్లో తేలికపాటి నుండి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా నింద్రలో 41.4, అత్యల్పంగా బైరెడ్డిపల్లెలో 0.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది.పెద్దపంజాణిలో 30.4, కార్వేటినగరంలో 17.4, ఐరాలలో 13, నగరి, వెదురుకుప్పం మండలాల్లో 12.6, రొంపిచెర్లలో 12.4, పెనుమూరులో 11.8, చౌడేపల్లెలో 10, యాదమరిలో 9.6, రామకుప్పంలో 8.2, చిత్తూరు, శాంతిపురం మండలాల్లో 7.6, సోమలలో 6.8, గంగవరంలో 5.8, బంగారుపాళ్యంలో 5.6, కుప్పంలో 5.4, తవణంపల్లెలో 3.4, గుడుపల్లె, విజయపురం మండలాల్లో 3.2, గుడిపాలలో 3, పులిచెర్లలో 2.4, పుంగనూరులో 2.2, సదుంలో 2, పలమనేరులో 1.8, పాలసముద్రంలో 1.2, వి.కోటలో ఒక మిమీ వర్షపాతం నమోదైంది.మేనెల సాధారణ వర్షపాతం 4.5 మిమీ కాగా, శుక్రవారం వరకు 45 మిమీ వర్షపాతం నమోదయ్యింది. 20శాతం కంటే మించి 17 మండలాల్లో, 20 శాతం లోపు 14 మండలాల్లో వర్షం కురిసింది.కాగా శుక్రవారం అత్యధికంగా వెదురుకుప్పంలో 41.3, అత్యల్పంగా రామకుప్పంలో 33.0 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తవణంపల్లెలో 40.6, నగరిలో 40.5, శ్రీరంగరాజపురంలో 38.1, గుడిపాలలో 37.5, చిత్తూరులో 37.2, బంగారుపాళ్యంలో 36.9, గంగాధరనెల్లూరులో 36.5, పులిచెర్ల, పూతలపట్టు మండలాల్లో 36.1, చౌడేపల్లె, విజయపురం, పాలసముద్రం, యాదమరి, ఐరాల, నింద్ర, పెనుమూరు మండలాల్లో 35.9, కార్వేటినగరంలో 35.8, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 35.2, సదుం, సోమల మండలాల్లో 35.1, గుడుపల్లె, శాంతిపురం, కుప్పం మండలాల్లో 35, రొంపిచెర్లలో 34.3, పలమనేరులో 34, వి.కోట, పుంగనూరు మండలాల్లో 33.5, బైరెడ్డిపల్లెలో 33.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అమరవీరుడు మురళీనాయక్



బంగారుపాళ్యం, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడి అమరుడైన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్‌కు స్థానిక యువత, ఉపాధ్యాయులు ఘన నివాళి అర్పించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జడ్పీ హైస్కూల్ సమీపంలో ఉన్న కార్గిల్ స్థూపం వద్ద ఆయన చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు.

చిత్తూరు సిటీ: మురళీనాయక్‌కు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ ఘన నివాళి అర్పించారు. ఈ మేరకు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని పుల్లూరు క్రాస్ రోడ్డులో మురళీ నాయక్ చిత్రపటం వద్ద తన కుమారుడు రాహుల్‌తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శుక్రవారం ఘన నివాళి అర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, రాజశేఖర్ నాయుడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నేడు ర్యాలీ

మాజీ సైనిక సంఘం

చిత్తూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శనివారం సాయంత్రం చిత్తూరులో ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు రామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు గాంధీ సర్కిల్ వద్ద ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని.. మాజీ సైనికులు, వారి కుటుంబీకులు, దేశ భక్తులు, పౌరులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



బంగారుపాళ్యంలోని కార్గిల్ స్థూపం వద్ద మురళీనాయక్‌కు నివాళి

జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీ



చిత్తూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో అనూహ్య సంఘటనలు చోటు చేసుకోకుండా గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో జరిపిన తనిఖీల్లో ఎస్పీ మణికంఠ పాల్గొన్నారు. వాహనాల తనిఖీ, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, రికార్డులు లేకుండా వాహనాలను కలిగి ఉండటం తదితర వాటిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో 1,761 వాహనాలను తనిఖీ చేశారు. 101 మందిపై వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి.. రూ.27,295 జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురిపై, బహిరంగంగా మద్యం తాగి ఐదుగురిపై కేసు నమోదు చేశారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలను కల్గి ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా చౌడేపల్లె పోలీసుస్టేషన్ పరిధిలో 100 టెట్రాప్యాకెట్లను, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పెద్దపంజాణి పోలీసుస్టేషన్‌లో సరైన బిల్లులు లేకుండా రవాణా చేస్తున్న పదివేల లీటర్ల డీజిల్ ట్యాంకరును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అంతటా 55 లాడ్జీల్లోని 325 గదులను తనిఖీలు చేశారు. తొమ్మిది బస్టాండ్లు, నాలుగు రైల్వేస్టేషన్లలోనూ తనిఖీలు జరిగాయి.

సాహితీవేత్త ప్రేమావతి కన్నుమూత

● తిరుపతి పద్మావతి డిగ్రీ కాలేజీ తొలితరం తెలుగు అధ్యాపకురాలిగా విశేష కృషి



సాహిత్యవేత్త, పద్మావతి డిగ్రీ కళాశాల తొలితరం అధ్యాపకురాలు డీఎం. ప్రేమావతి(83) కన్నుమూశారు. సోమవారం ఉదయం అస్వస్థతకు గురైన ఆమె స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆఖరి శ్వాస విడిచారు. గుడిపాల మండలం నంగమంగళం ఈమె పుట్టిన ఊరు. ఆడపిల్లలకు చదువెందుకు అనే రోజుల్లో ఊరుదాటి విద్యాభ్యాసం చేశారు. దాశరథి రంగాచార్య నవలలపై పీహెచ్‌డీ చేసిన ప్రేమావతి 1965లో పద్మావతి కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా చేరారు. 2000లో రీడర్‌గా రిటైరయ్యారు. ఈమె గురువు పద్మావతి కళాశాల రూపశిల్పి రాజేశ్వరీ మూర్తి 104 ఏళ్ల వయసులో ఇటీవలే మరణించారు. ప్రేమావతి రాసిన ఆచార్య జీఎన్ రెడ్డి జీవిత చరిత్రను కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. పద్మావతి కళాశాలలోనే చదువుకుని, అక్కడే బోధన చేసి రిటైరైన ప్రేమావతి తన అనుభవాలను 'నేనూ- నా కళాశాల' పేరుతో ఒక పుస్తకాన్ని రాశారు. సాహిత్య సభల్లో ఆమె ఉపన్యాసాలు విశేషంగా ఆకట్టుకుంటాయి. ప్రేమావతి మరణంతో ఆమె శిష్యులు, సాహిత్యకారులు, విద్యావేత్తలు విషాదంలో మునిగిపోయారు. తిరుపతిలోని బైరాగిపట్టెడ పార్క్ సమీపంలోని ఆమె స్వగృహం వద్ద అభిమానుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ఉంచారు. శనివారం ఉదయం 10 గంటలకు కరకంబాడి రోడ్డులోని గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

\- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

సిబ్బంది ఫుల్.. సేవలు నిల్!

కుప్పం సచివాలయాల్లో ఇదీ పరిస్థితి



శుక్రవారం ఉదయం 10.37 గంటలకు ఖాళీ సీట్లతో కనిపిస్తున్న మంకలదొడ్డి సచివాలయం

కుప్పం, మే 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మంకలదొడ్డి పంచాయతీ సచివాలయానికి పనులనిమిత్తం వెళ్లిన గ్రామస్థులు శుక్రవారం ఉదయం 10.37 గంటలకు తీసిన ఛాయాచిత్రమిది. పింఛన్ల పంపిణీ, రేషన్ కార్డులు, జనన మరణ ధృవీకరణ పత్రాలు, ఇంటి పన్నుల వసూళ్ల వంటి అన్నిరకాల పౌర సేవలు ఇప్పుడు సచివాలయాల ద్వారానే ప్రజలకు అందుతున్నాయి. అంటే.. ఆయా సేవలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిది. కానీ సచివాలయాల ద్వారా సరైన సేవలు తమకు అందడంలేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. ఇక్కడి సిబ్బంది కొంత మంది సర్వేలకు వెళ్లిపోతుంటే, మరికొందరు మాతృసంస్థల్లో పనులున్నాయంటూ ఇటువైపు తిరిగి చూడడంలేదు. సెక్రటరీలకు ఆయా పనులతోపాటు తరచూ ఉన్నతాధికారుల సమావేశాలలో పాల్గొనాల్సి ఉండడంతో సచివాలయాలకు వచ్చే సమయం చిక్కడం లేదు.మంకలదొడ్డి సచివాలయంలో సెక్రటరీ భాస్కర్ మంకలదొడ్డితో పాటు పక్కనే ఉన్న జరుగు సచివాలయానికి కూడా ఇన్‌చార్జి. ఆయన శుక్రవారం కుప్పం మండల సచివాలయంలో జరిగిన ఉన్నతాధికారుల సమావేశానికి హాజరయ్యారు. మహిళా పోలీసు గత నెల 23 నుంచి రెండు నెలల సెలవులో వెళ్లారు. ఇక మిగిలింది వీఆర్వో, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్. వీరిలో ఒక్కరు కూడా సరైన సమయానికి సచివాలయానికి చేరుకోలేదు. ఉదయం 11 గంటలదాకా మంకలదొడ్డి సచివాలయం ఖాళీగానే ఉంది. అలాగని ప్రభుత్వం అప్పగించిన మనమిత్ర సర్వే, సిటిజన్ సర్వే సక్రమంగా జరుగుతున్నాయా అంటే అదీ లేదు. అక్కడా వెనుకబాటే. ఇటీవల ఒక నెల వేతనం నాలుగైదు రోజులపాటు నిలిపేస్తే ఈ సిబ్బందిలో ఇద్దరు గగ్గోలు పెట్టారు. మాతృ సంస్థల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి మరీ వేతనం డ్రా చేసుకుని పంతం నెగ్గించుకున్నారు. ఈ ఇద్దరు సిబ్బందీ సర్వేలు చేయడానికి ససేమిరా అంటున్నారట. ఇదేమని ప్రశ్నిస్తే తమ మాతృ సంస్థల్లో దిక్కుమాలినన్ని పనులున్నాయి కాబట్టి సర్వేలు చేసేది లేదని తెగేసి చెబుతున్నారట. అలాగని ఆయా డిపార్టుమెంట్ల హెడ్డుల నుంచి లెటర్లు తీసుకురమ్మంటే అది కూడా చేయడం లేదని సమాచారం. కట్ చేస్తే మంకలదొడ్డి పంచాయతీ సచివాలయం శుక్రవారం ఇలా ఖాళీగా కనిపించింది. ఇది ఒక్క మంకలదొడ్డి సచివాలయం, అక్కడి సిబ్బంది పరిస్థితే కాదు.. మొత్తం కుప్పం నియోజకవర్గంలోని అన్ని సచివాలయాలు, సిబ్బంది పరిస్థితి కూడా. ఈ సమస్యకు పరిష్కారం వెదకాల్సిన బాధ్యత కడా పీడీ వికాస్ మర్మత్ మీద ఉంది.

రాజనాలబండ హుండీ లెక్కింపుతో రూ.లక్ష ఆదాయం



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ అభయాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపుతో రూ.లక్ష ఆదాయం చేకూరినట్లు ఆలయ సూపరింటెండెంట్ నాగేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్వామివారికి భక్తులు రూ.1,00,779 నగదు హుండీలో కానుకల రూపంలో సమర్పించినట్లు తెలిపారు. ఈ ఆదాయన్ని చౌడేపల్లె ఇండియన్ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్, రాహుల్, ఆలయ అర్చకులు కృష్ణమూర్తి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కాకాతోపు ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణిగా చందనప్రియ



పలమనేరు, మే 9 (ఆంధ్రజ్యోతి): పలమనేరు కాకాతోపు పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణిగా శుక్రవారం డాక్టర్ చందనప్రియ బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి సిబ్బంది డాక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, వైద్యసిబ్బంది ఉషాకుమారి, అముద, పార్వతి, వాణి, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న వైద్యాధికారి విజయచందర్

బైరెడ్డిపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో శుక్రవారం గర్భిణులకు పౌష్టికాహారాన్ని వైద్యాధికారి విజయ చందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, వడదెబ్బ నివారణ, పోషకాహార ప్రాముఖ్యత తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్యశిబిరాల నిర్వహణ, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మహతి ఫౌండేషన్ సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ శాలిని, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి 18 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నారాయణమొదలి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 10న ధ్వజారోహణం, శేషవాహనం, 11న శ్రీవారి కల్యాణోత్సవం, 12న రథోత్సవం, గరుడోత్సవం, 13న హంసవాహనం, 14న సింహవాహనం, హనుమంత వాహనం, 15న పుష్పపల్లకీ సేవ, 16న గజవాహనం, 17న ఊంజలోత్సవం, అశ్వవాహనం, దోపోత్సవం, 18న వసంతోత్సవం, పుష్పయాగం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో పాల్గొనాలని కోరారు.

అంబేడ్కర్ సర్కిల్‌లో బస్సుషెల్టర్ ఏర్పాటు చేయాలి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, మే (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్‌ను నిర్మించాలని ఎంపీడీవో లాలీమాధవికి శుక్రవారం మాలమహానాడు కార్యదర్శి అశోక్‌కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యం వందల సంఖ్యలో వివిధ పనులపై మదనపల్లెకు వెళుతున్న ప్రజల సౌకర్యార్థం బస్సు షెల్టర్‌ను నిర్మించాలని కోరారు. నాయకులు వెంకటరమణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడులు



టమోటా పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమార్

పుంగనూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ శివకుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని మోదుగులపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించి ప్రతిభ కనబరిచిన రైతులకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.12 వేలు, మూడో బహుమతిగా రూ.8 వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం టమోటా పంటలను పరిశీలించి సూచనలిచ్చారు. రైతుసేవా కేంద్ర సిబ్బంది వసంత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వెదురుకుప్పం, మే 9 (ఆంధ్రజ్యోతి): చిన్నమరెడ్డికండ్రిగలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపం, భజనలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, ప్రధాన కార్యనిర్వాహకుడు మిట్టపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి పర్యవేక్షించారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



రొంపిచెర్ల పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్

రొంపిచెర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినయ్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. రక్తహీనతపై పలు సూచనలు చేశారు. సురక్షితమైన ప్రసవం కోసం ప్రభుత్వాస్పత్రిలోనే కాన్పులు చేసుకోవాలన్నారు. ఆరునెలల పాటు తల్లిపాలు తాగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్‌ఎన్ పార్వతమ్మ, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాథమిక సహకార సంఘ సీఈవోగా రామరాజు



పెద్దపంజాణి, మే 9 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి ప్రాథమిక సంఘం సీఈవోగా రామరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఈవో బదిలీపై వెళ్లారు. రామసముద్రంలో విధులు నిర్వహిస్తున్న రామరాజు పెద్దపంజాణికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను సకాలంలో అందిస్తామన్నారు. అలాగే రైతుల సౌకర్యార్థం దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలను అర్హులైన రైతులందరికీ రునాలు అందివ్వడానికి కృషి చేస్తామన్నారు. అలాగే బంగారంపై రుణ పరిమితిని పెంచుతామని తెలిపారు.

చౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రొంపిచెర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ నడింపల్లెలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో జ్యోతి మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో మహిళలు పూజా సామాగ్రితో పాటు రాగదీయులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

12 నుంచి అన్ని మండలాల్లో గ్రామకమిటీల ఏర్పాటు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈనెల 12 నుంచి 22 వరకు టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు జరుగుతాయని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి మండల కేంద్రంలో ఆయా గ్రామ, బూత్ కమిటీల ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెలలో కడపలో జరిగే మహానాడు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

గజ బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల గుంపు దాడుల్లో పంటలను నష్టపోతున్న బాధిత రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాధంనాయుడు కోరారు. పులిచెర్ల మండలం రాయవారిపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రెండేళ్ల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పలు దఫాలుగా పంటలను ధ్వంసం చేయడం పరిపాటిగా మారిందన్నారు. దీంతో అటవీప్రాంతం సరిహద్దులోని రైతాంగం వ్యవసాయంపై ఇప్పటికే ఆశలు వదిలేసుకున్నారని తెలిపారు. బాధిత రైతులకు అటవీశాఖ తూతూమంత్రంగా నష్ట పరిహారం చెల్లిస్తుండటం బాధాకరమన్నారు. పంటలపై ఏనుగుల దాడులను నివారించడంలో అటవీశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కోతులు, అడవిపందులు ఒక వైపు పంటలను ధ్వంసం చేస్తుంటే మరో వైపు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని వాపోయారు. ఏనుగుల గుంపును కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

సదుం, మే 9 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పాత రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులను ఆయా పంచాయతీ, గ్రామ, వార్డు సచివాలయాలలో అందజేయాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎం చంద్రబాబుతో భేటీ



పుంగనూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మదనపల్లె, పుంగనూరు విద్యాసంస్థల అధినేతలు సేతు, చంద్రమోహన్‌రెడ్డిలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో పాటు ముఖ్యమంత్రిని కలిసి ప్రైవేటు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

వైభవంగా మృత్యుంజయేశ్వరస్వామి రథోత్సవం



మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు



మృత్యుంజయేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

చౌడేపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం స్వామివారి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి స్వామివారి ఉత్సవమూర్తులను అదిష్టింపజేశారు. వేదపండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మడుగు తేరులో వినాయక స్వామిని అదిష్టింపజేసి ప్రత్యేకంగా అలకంరించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాటలు, చెక్క భజనలతో కోలాహలంగా స్వామివారిని పురవీధుల్లో నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, పానకం, వడపప్పులను ప్రసాదంగా అందించారు. స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి బలిజ సంఘం సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం





బైరెడ్డిపల్లె: బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్, కల్లూరులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీవో మల్లీశ్వరి

బైరెడ్డిపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ కోరారు. మండలంలోని ఎం.కొత్తూరు, గడ్డూరు గ్రామాల్లో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాల్యవివాహాలపై కలిగే సమస్యల గురించి అవగాహన కల్పించారు. చిన్నవయస్సులో గర్భధారణతో ఏర్పడే ఆరోగ్య సమస్యలు, వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుజాత, దాక్షాయణి, జయలక్ష్మి, శివరాణి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

- కల్లూరు: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఇన్‌చార్జి సీడీపీవో మల్లీశ్వరి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీడీపీవో మాట్లాడుతూ 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగు పరచడం ఉద్దేశమన్నారు. బాలికల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు చేసినా.. సహకరించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, మహిళా పోలీసు చరీనా, ఏఎన్‌ఎం సరస్వతీ, అంగన్‌వాడీ వర్కర్లు ధనలక్ష్మీ, అమృత, శారద, శ్యామల పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- అధికారులకు ఎమ్మెల్యే జగన్మోహన్ సూచన



చిత్తూరు సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కరించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి 66 అర్జీలు అందాయి. మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం: మురళీమోహన్

ప్రజల సమస్యలు పరిష్కరిచడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో 74 అర్జీలు వచ్చాయన్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయండి

- వరసిద్ధుడి ఆలయ ఉద్యోగులకు ఈవో సూచన

ఐరాల(కాణిపాకం), మే9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని ఉద్యోగులంతా అంకిత భావంతో పనిచేయాలని ఈవో పెంచలకిషోర్ సూచించారు. శుక్రవారం ఆలయ ఆస్థాన మండపంలో అన్నిశాఖల అధికారులు, అర్చక, వేదపండితులు, సిబ్బందితో సమీక్షించారు. భక్తులతో, విరాళాలు ఇచ్చే దాతలతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సిబ్బందికి తెలిసినవారు దర్శనార్థం వస్తే తప్పనిసరిగా దర్శన టికెట్ కొనుగోలు చేసే ఆలయంలోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ప్రొటోకాల్ ఉన్నవారికి, ఆలయ ఉభయదారులు, వారి కుటుంబీకులకు తప్ప మిగిలిన వారెవరైనా కచ్చితంగా టికెట్లు కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చారు. స్వామి దర్శన విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిబ్బందికి ఇబ్బందులుంటే తన దృష్టికి తేవాలని, భక్తులను గణేశ అని సంబోధిస్తే వారుకూడా స్వామి నామస్మరణ చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ఈఈ వెంకటనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ధనంజయ, ప్రసాద్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.73 లక్షల విరాళం

వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,11,116, అన్నదాన కార్యక్రమానికి రూ.62,000లను హైదరాబాదుకు చెందిన బాలాజీవెంకటేశ్వర్లు అందించారు. అలాగే గోసంరక్షణ ట్రస్టుకు రూ.50,116, అన్నదాన కార్యక్రమానికి రూ.50,116లను సత్యనారాయణ, రమాదేవిలు విరాళమిచ్చారు. దాతలకు ఏఈవో రవీంద్రబాబు దర్శన ఏర్పాట్లను చేశారు.

చంద్రబాబు సీఎంగా ఉంటే కంపెనీలు క్యూ కడతాయి

- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ హేమలత తదితరులు

చిత్తూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సీఎంగా ఉంటే రాష్ట్రానికి కంపెనీలు క్యూ కడతాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. శుక్రవారం మిట్టూరులోని కుట్టి కోచింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డీఎస్సీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉండాలన్న ఉద్దేశంతో విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి చిత్తూరులో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంఘిక, మైనార్టీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇక్కడ ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తున్నామన్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, అట్లూరి శ్రీనివాసులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నవధాన్యాల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని ఉదయాన్నే శుద్ధి చేసి వేప, మామిడి తోరణాలు కట్టి అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకొని చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఉరుసు ఉత్సవానికి అమరనాథరెడ్డికి ఆహ్వానం



బైరెడ్డిపల్లెలో ఉరుసు ఉత్సవానికి ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

పలమనేరు, మే 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని హజరత్ బిస్మిల్లా షాఖాదరి 60వ ఉరుసు ఉత్సవానికి నిర్వాహకులు శుక్రవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి ఆహ్వానించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన్ను కమిటీ సభ్యులు సన్మానించారు. 10న శనివారం జరగనున్న ఖవ్వాలి కార్యక్రమాలకు విచ్చేయాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు అజ్గర్, షబ్బీర్, సిద్దూ, ఖాదర్, ఆజాద్, అబ్బు, రియాజ్, తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేద్దాం

- డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి



చిత్తూరు సెంట్రల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేద్దామని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సెర్ప్ ఉద్యోగులు, ఏపీఎం, సీసీ, ఎస్‌హెచ్‌జీలకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికలను మైక్రో క్రెడిట్ ప్లాన్‌గా మార్చే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సెర్ప్ సీఈవో ఆదేశాలతో గత నెలలో జిల్లా వ్యాప్తంగా 35వేల సంఘాల్లోని 3.50 లక్షల మంది సంఘ సభ్యుల వార్షిక రుణ అవసరాలను యాప్ ద్వారా గుర్తించామన్నారు. దీనికి సమాంతరంగా వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ చేయడంలో భాగంగా విమెన్ లెడ్ ఎంటర్‌ప్రెన్యూర్ రుణాలను బ్యాంకుల ద్వారా ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఇండియన్ బ్యాంకు జడ్‌ఎం మోహన్, బీఎం మురళీకృష్ణ, సిబ్బంది రవికుమార్, మధు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 10 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. బుధ, గురువారాల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. 10మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం వీరిని కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. విచారించిన ఆమె నిందితులు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని సీఐ పేర్కొన్నారు.

నివాళి



వెళ్లిపోయిన ప్రేమమూర్తి

పద్మావతి కళాశాల తొలితరం అధ్యాపకురాలు ప్రేమావతి మృతితో శోకసంద్రంలో స్నేహాభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు),మే9(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఒక తరం సాహిత్యవేత్త వెళ్లిపోయారు. పద్మావతి డిగ్రీ కళాశాల తొలితరం విద్యార్థి, అధ్యాపకురాలు కూడా అయిన డాక్టర్ డీఎం. ప్రేమావతి మరణం ఆమె శిష్యులనూ, సాహిత్యకారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. గుడిపాల మండలం నంగమంగళంలో 1942లో పుట్టిన ప్రేమావతి ఊరుదాటి చదువుకోవడమే ఆ కాలపు విచిత్రం. వీరికి తాతయ్యే కేఎం.రెడ్డి ఇందుకు కారణం. పై స్కూల్ ఫైనల్ తర్వాత చదువులకు తండ్రి అంగీకరించకపోవడంతో తల్లి నగలు దొంగలించి, ఆ డబ్బులతో రవీంద్ర నాథ్‌ఠాగూర్ శాంతినికేతన్‌లో చేరారు. ఆ తర్వాత స్వంత ఊరికి తిరిగి వచ్చి బొమ్మసముద్రంలో పాక వేసి 1948లో బడి తెరిచారు. ఊరూరికీ తిరిగి పిల్లల్ని చేర్పించారు. ముఖ్యంగా ఆడపిల్లల చదువుల మీద ఆయన పెట్టిన శ్రద్ధతో ఆరేళ్ల ప్రేమావతి కూడా 1948లో బొమ్మసముద్రం బడిలో చేరారు. స్కూల్ ఫైనల్ తప్పితే పెళ్లి చేసేస్తామని ఇంట్లో బెదిరించడంతో ఆమె చదువే జీవితంగా గడిపారు. 1952లో తిరుపతిలో ప్రారంభమైన పద్మావతి కళాశాలలో 1958లో పదహారేళ్ల ప్రేమావతి పీయూసీ విద్యార్థిగా చేరారు. ఆ తొలి మెట్టే ఆమె అంతిమ లక్ష్యంగా మారింది. పద్మావతి కళాశాల రూపశిల్పి రాజేశ్వరీ మూర్తికి ప్రియశిష్యురాలిగా మారారు. డిగ్రీ పూర్తి అయ్యాక ఆచార్య జీఎన్ రెడ్డి ప్రోత్సాహంతో ఎస్వీయూలో పీజీ చేశారు. ఆయన పర్యవేక్షణలోనే దాశరధి రంగాచార్య నవలల మీద పీహెచ్‌డీ చేశారు. రాజేశ్వరీ మూర్తి పట్టుదల వల్ల 1965లో తనకు విద్యాభిక్ష పెట్టిన పద్మావతి కళాశాలలోనే అధ్యాపకురాలిగా చేరారు. వందలాది మంది విద్యార్థులను ప్రభావితం చేశారు. ఆడవాళ్లకు చదువు అవసరం గురించి పదేపదే చెప్పేవారు. స్వతంత్రంగా జీవించమని అనేవారు. ఆమె శిష్యులు పలువురు వివిధ హోదాల్లో ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉన్నారు.

సాహిత్యవేత్తల సాన్నిహిత్యం : ప్రముఖ సాహిత్యవేత్తలు కెవి రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు, వకుళభరణం రామకృష్ణ, లలిత, ఆచంట శారదా దేవి, జానకీరాం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, మధురాంతకం రాజాం, పులికంటి కృష్ణారెడ్డి, ఆచార్య పీసీ నరసింహారెడ్డి తదితరులతో సన్నిహితంగా మెలిగారు. తిరుపతిలో జరిగే సాహిత్య సభల్లోనూ, పద్మావతి కాలేజీ సభల్లోనూ ఆమె కనిపించేవారు. తాను చదువుకున్న పద్మావతి కళాశాల అన్నా, ఆ కళాశాలకు రూపం ఇచ్చిన రాజేశ్వరీ మూర్తి అన్నా ప్రేమావతికి ప్రాణం. ఈ ప్రస్తావన లేకుండా ఆమె మాటలు సాగేవి కాదు. రాజేశ్వరీ మూర్తి పుట్టిన రోజులను క్రమం తప్పకుండా జరిపేవారు. ఆమె విద్యారంగానికి చేసిన సేవల గురించి వ్యాసాలు రాసేవారు. 104 ఏళ్ల వయసులో తన గురువు రాజేశ్వరీ మూర్తి అమెరికాలో ఇటీవల కన్ను మూయడంతో ప్రేమావతి బాగా దుఃఖించారు. ఒంటరిగా జీవిస్తూనే కన్నుమూసిన ప్రేమావతి తన ఇంట్లో అద్దెకున్న ఈశ్వరి, ఆమె ఇద్దరు కుమారులనే తన కుటుంబంలా మార్చుకున్నారు. నా కోడలు, నా మనుమలు అని మురిపెంగా చెప్పుకునేవారు. ఆమె ఆఖరి శ్వాస దాకా వారు వెన్నంటే ఉన్నారు.

ప్రేమకు ప్రతిరూపం

ప్రేమావతి మరణంతో ఆమె స్నేహమాధుర్యాన్ని చవిచూసినవారంతా శోకతప్తులయ్యారు. ఆమె క్రమశిక్షణాయుతమైన జీవనశైలిని గుర్తు చేసుకుంటున్నారు. ఎప్పుడూ నలగని చీర, తలలో మల్లెపూలతోనే ఆమె కనిపించేవారు. 'మనుషుల పట్ల ఆమె ప్రేమాభిమానాలకు కొలతల్లేవు. ఆత్మవిశ్వాసానికీ, ఆత్మాభిమానానికీ ఆమె నిలువెత్తు సాక్ష్యంగా జీవించారు' అని ప్రసిద్ధ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ కృష్ణప్రశాంతి గుర్తు చేసుకున్నారు. 'ప్రేమకు ప్రతిరూపం ప్రేమావతి. తన మిత్రులు ఎవరు అనారోగ్యానికి గురైనా తల్లడిల్లిపోయేవారు. ఆమె లోటు స్నేహాభిమానాలు అందుకున్నవారికి ఎన్నటికీ తీరనిది' అని ప్రముఖ చిత్రకారిణి కిరణ్‌కుమారి వ్యాఖ్యానించారు. 'ఆమె ఉత్తమ అధ్యాపకురాలు, భాషా, సాహితీ సేవకురాలు. విద్యారంగానికి మేలుబంతి' అని సాకం నాగరాజ అన్నారు. ' వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రేమావతి మరణం పెద్ద లోటు' అని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధరప్రసాద్ అన్నారు. గార్లపాటి దామోదర నాయుడు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, రాఘవ, మల్లారపు నాగార్జున, ఓ.వెంకటరమణ, కష్ణవేణిశైలకుమార్, తోట వెంకటేశ్వర్లు, యువశ్రీ మురళి వంటి ఎందరో సంతాపం తెలిపారు. పద్మావతి కాలేజీలో సంతాప సభ నిర్వహించారు. పద్మావతి కాలేజీకి ప్రేమావతి అందించిన సేవలను పద్మావతి జూనియర్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్ళు భువనేశ్వరీదేవి, నారాయణమ్మ కొనియాడారు.

గుడుపల్లెలో భూగర్భ జలమట్టం ఆందోళనకరం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

కుప్పం, మే 9 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలంలో భూగర్భ జలమట్టం చాలా దారుణంగా పడిపోయిందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని అత్యంత దిగువకు జారిన ఇక్కడి భూగర్భ జలమట్టాన్ని పెంచడానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి శుక్రవారం గుడుపల్లె మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇక్కడే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులతో గుడుపల్లెలో భూగర్భ జల మట్టం పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మండలంలో ప్రస్తుతమున్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూనే ప్రజలు దాహార్తిలో అలమటించకుండా అవసరమైన చోట్ల బోరుబావులు వేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. భూగర్భ జలమట్టానికి సంబంధించి చివరి స్థానంలో ఉన్న గుడుపల్లె మండలంలో మట్టాన్ని పెంచడంతోపాటు కరువు నివారణ కోసం పలు చర్యలను నిర్దేశించారు. చెరువుల్లో పూడిక తీయడం, బలహీనంగా ఉన్న చెరువుకట్టలను బలోపేతం చేయడం, చెరువులను అనుసంధానించడం వంటి పనులను మండల అధికారులతో ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకుని చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలలో మురుగు కాలువల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. త్వరలో పూర్తి కాబోయే హంద్రీ-నీవా కాలువ ద్వారా మండలంలోని చెరువులను నింపాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కొంతమంది రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయంలో హెచ్ఎన్ఎస్ఎస్, ఇరిగేషన్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం, ఎంపీడీవో రాధాకృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు





ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, ఈవో ఏకాంబరానికి విరాళం అందిస్తున్న వెంకటా చలపతి

చౌడేపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతి కరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల అభిషేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో, ఉపకమిషనర్ ఏకాంబరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అమ్మవారి భక్తుడు వెంకటా చలపతి, ఆయన సతీమణి పుష్పలత భక్తుల అన్నదానం కోసం రూ.25 వేలు, గోశాల నిర్వహణకు రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. దాతలను ఆలయ ఈవో శాలువతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గిరిజనుడి మృతి



మృతిచెందిన రెడ్డప్ప మృతదేహం

చౌడేపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ గిరిజనుడు మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. ఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం మేరకు ... చౌడేపల్లెలోని గడ్డంవారిపల్లె రోడ్డులో ఉన్న యానాదికాలనీకి చెందిన మునస్వామి కుమారుడు ఇరువారం రెడ్డప్ప (31) పుంగనూరు రోడ్డులో ఉన్న మంజునాథ్ మామిడి తోపునకు కాపలా ఉంటున్నాడు. యల్లకుంట్ల సమీపంలో రెడ్డిశేఖర్ మామిడితోపులో రెడ్డప్ప బంధువులు కాపలాగా ఉన్నారు. రెండురోజుల క్రితం గంగజాతరకు రెడ్డిశేఖర్ మామిడితోపులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. జాతర పూర్తి చేసుకుని ఉదయం యల్లకుంట్ల నుంచి చౌడేపల్లె బయలుదేరి బస్సు లేక ఆటో కోసం రోడ్డులో వేచి ఉన్నాడు. ఈ నేపథ్యంలో పుంగనూరు నుంచి చౌడేపల్లె వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం రెడ్డప్పను ఢీకొంది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో పాటు రెడ్డప్ప వాహనానికి తగులుకోవడంతో సుమారు అరకిలో మీటరు వరకు ఈడ్చుకుంటూ వచ్చారు. ఆ తర్వాత అప్పటికే మృతి చెందినట్లు గుర్తించిన వాహనదారుడు మృతదేహాన్ని రోడ్డుకు పక్కనే వదిలేసి వెళ్లిపోయాడు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళం



పలమనేరు, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం దేశ సరిహద్దుల్లో ప్రాణాలొడ్డి పోరాడుతున్న వీరజవాన్ల సంక్షేమం కోసం పలమనేరు ఆర్య వైశ్య 365 గ్రూపు సభ్యులు రూ. 25 వేలు వితరణగా అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కేవీ రాఘవులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీవాసవి ఆర్యవైశ్య 365 గ్రూపు సభ్యులు ఎల్లంపల్లి నరేంద్రబాబు, శ్రీపురం సురేష్‌కుమార్, భాగీరథి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

తోటి వేషం వేసి.. గంగమ్మను దర్శించి



పిల్లలు ఒళ్లంతా బొగ్గుపొడి పూసుకున్నారు. తెల్లనామం సాధి కనుబొమ్మల పైన చుక్కబొట్లు పెట్టుకున్నారు. నడుం చుట్టూ, తలకు వేపాకు మండలను కట్టుకున్నారు. ఇలా శుక్రవారం తిరుపతి గంగజాతరలో తోటి వేషధారణతో అమ్మవారిని మొక్కుకున్నారు. పలువురు చిత్ర విచిత్ర వేషాలు ధరించారు. ఇక, సాయంత్రం 4 గంటల నుంచి భక్తుల రద్దీ పెరిగింది. ఇక, వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా ప్రసిద్ధికెక్కిన తాతయ్యగుంట గంగమ్మకు శనివారం సాయంత్రం టీటీడీ తరపున సారె అందించనున్నారు. అలాగే, శనివారం దొర వేషాన్ని కైకాల, చాకలి కులస్థులు అనువంశికంగా వేస్తారు. ఈ వేషాన్ని ఇతరులెవరూ వేయరు. తక్కిన భక్తులు పలు రకాల వేషాలతో అమ్మవారిని దర్శించుకుంటారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



గంగమ్మ ఆలయంలో శుక్రవారం సాయంత్రం భక్తుల రద్దీ

'అభ' ఐడీ నమోదు వంత శాతం పూర్తవ్వాలి

డీఎంహెచ్‌వో సుధారాణి



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి ఒక్కరికీ అభ (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఐడీ నమోదు వంద శాతం పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో సుధారాణి ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో వివిధ ప్రోగ్రామ్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అభ ఐడీతో ప్రజారోగ్యాన్ని సులభంగా మానిటర్ చేయవచ్చన్నారు. మొదటగా ఐదు పీహెచ్‌సీలను ఎంపిక చేసి అభ, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈహెచ్‌ఆర్) నమోదు చేశాక మిగిలిన పీహెచ్‌సీల్లోనూ అదే పద్ధతిలో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్డు ద్వారా దేశంలో ఎక్కడికెళ్లినా రోగుల ఆరోగ్య రికార్డులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్‌సీడీ సర్వేపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అనంతరం వివిధ కార్యక్రమాలపైనా సమీక్షించారు. జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 12వ వేతన సవరణ కమిషన్(పీఆర్సీ)ని ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపుతో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ.. జీవో నెంబరు 117కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన తొమ్మిది రకాల పాఠశాలలు గందరగోళంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాత విధానంలోనే 1 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలు, 1నుంచి 8 వరకు ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 నుంచి పదో తరగతి వరకు ఉన్నత పాఠశాలల విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ.. పీఆర్సీ పెండింగ్ బకాయిలు, డీఏలను విడుదల చేయాలని కోరారు. మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. అనంతరం జేసీ విద్యాధరికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ ధర్నాలో నేతలు చంద్రశేఖర్‌నాయుడు, చంద్రన్, జగదీశ్, మధు, తులసి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

డీఐఈవో శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో శ్రీనివాసులు

చిత్తూరు సెంట్రల్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని డీఐఈవో శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక బీఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, కస్టోడియన్లు, ఫ్లయ్యింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బందికి పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15,377 మంది విద్యార్థుల కోసం 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫస్టియర్‌లో 10,236 మంది, సెకండియర్‌లో 3,724 మంది, ఒకేషనల్ ఫస్టియర్‌లో 810 మంది, సెకండియర్‌లో 607 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి సెంటర్‌లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 28 నుంచి జూన్ ఒకటో తేదీవరకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. ప్రశ్నపత్రాలను సకాలంలో ఆయా పోలీస్‌స్టేషన్ల నుంచి విత్‌డ్రా చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్రవాహనాల ద్వారా తీసుకురావద్దని హెచ్చరించారు. ప్రతి సీరిస్‌ను సరిచూసుకుని, విద్యార్థులకు సకాలంలో అందించాలని ఆదేశించారు. సరైన కారణాలతో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను నిర్దేశించిన సమయంలోపు పరీక్షలు రాయడానికి అనుమతించాలన్నారు. సమావేశంలో స్పెషల్ అధికారి దయానందరాజు, డీఈసీ మెంబర్లు బాలసుబ్రహ్మణ్యం, శరశ్చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల వర్గీకరణకు కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): జనాభా, ఆదాయాన్ని బట్టి పంచాయతీల వర్గీకరణకు కసరత్తు మొదలైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీలను నాలుగు విభాగాలు విభజించి.. గ్రేడ్‌ను బట్టి అర్హులైన వారిని కార్యదర్శులను నియమించాలని జీవోలో పేర్కొంది. ఆ ప్రకారం జిల్లాలోని పంచాయతీలను నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి 16వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ సూచించారు.

స్పెషల్ గ్రేడ్: వార్షికాదాయం రూ.కోటి మించినా లేదా పది వేల జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు ఈ విభాగంలో ఉంటాయి. వీటికి డిప్యూటీ ఎంపీడీవో (ఈవో పీర్డీ) స్థాయి అధికారులను పంచాయతీ కార్యదర్శులుగా నియమిస్తారు. జిల్లాలో స్పెషల్ గ్రేడ్ కింద 14 పంచాయతీలు చేరనున్నాయి.

గ్రేడ్-1: నాలుగు వేల నుంచి 10 వేల జనాభా లేదా వార్షికాదాయం రూ.50లక్షల నుంచి రూ.కోటి ఉన్నా.. లేదా ఆ పంచాయతీకి హెడ్‌క్వార్టరుగా మండల కేంద్రం ఉంటే గ్రేడ్-1గా పరిగణిస్తారు. దీని పరిధిలో సుమారు 60 పంచాయతీలు రానున్నాయి.

గ్రేడ్-2: ఇందులో 2 వేల నుంచి 4 వేల లోపు జనాభా ఉండే పంచాయతీలు చేరనున్నాయి. ఇలాంటివి 141 పంచాయతీలు ఉన్నాయి. **గ్రేడ్-3:** జనాభా రెండు వేలలోపు ఉండే పంచాయతీలన్నీ గ్రేడ్-3 కింద పరిగణిస్తారు. జిల్లాలో 572 పంచాయతీలు దీని కింద రానున్నాయి. స్పెషల్ మినహాయించి మిగతా పంచాయతీలకు నిబంధనల ప్రకారం కార్యదర్శులను నియమించనున్నారు. గిరిజన పంచాయతీలకు షరతులు వర్తించకుండా ప్రామాణికంగా తీసుకోనున్నారు.

గాలివానకు నేలకొరిగిన రేకుల షెడ్డు

● ఇద్దరు చిన్నారులకు గాయాలు



గాయపడ్డ రిహానా

పెద్దపంజాణి, మే 9 (ఆంధ్రజ్యోతి): గాలివానకు ఇంటిముందున్న రేకులషెడ్డు నేలకొరగడంతో ఇద్దరు చిన్నారులు గాయ పడిన సంఘటన పెద్దపంజాణి మండలం చిన్నేపల్లెలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు.. గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించడంతో చిన్నేపల్లె గ్రామంలోని అఫ్రోజ్ ఇంటిముందున్న రేకులషెడ్డు కూలింది. ఆ సమయంలో రేకుల కింద ఉన్న చిన్నారులు రిహానా, సుఫియాబాను తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ఇద్దరు చిన్నారులను కుటుంబ సభ్యులు పలమనేరు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

ఆర్మీకి విరాళాలివ్వండి

● సైబర్ నేరగాళ్ల మెసేజీలు

● నమ్మి మోసపోవద్దంటున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు 'ఆపరేషన్ సిందూర్'నూ వదల్లేదు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితులను సొమ్ము చేసుకునే పనిలో పడ్డారు. తాము ఆర్మీ అధికారులమని, ఆర్మీకి విరాళాలు ఇవ్వాలంటూ పలువురికి మెసేజీలు పంపుతున్నారు. వీటిని ఎవరూ నమ్మొద్దని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ఈ తరహా సైబర్ మోసాల గురించి తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రభుత్వం, ఆర్మీ అధికారులు, సైనికులు విరాళాలు అడగరని, ఎవరూ ఇలాంటి లింకులు టచ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. 'ఏపీకె ఫైల్స్'ను ఓపెన్ చేయొద్దన్నారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోను కాల్స్.. మెసేజీలు వస్తే స్పందించవద్దని హితవు పలికారు. యూపీఐ చెల్లింపులు చేయొద్దన్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకుంటే సైబర్ నేరగాళ్లు దోచేస్తారన్నారు. ఇలాంటి వాటిపై 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

చంద్రబాబు సీఎంగా ఉంటే కంపెనీలు క్యూ కడతాయి

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ హేమలత తదితరులు

చిత్తూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సీఎంగా ఉంటే రాష్ట్రానికి కంపెనీలు క్యూ కడతాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. శుక్రవారం మిట్టూరులోని కుట్టి కోచింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డీఎస్సీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉండాలన్న ఉద్దేశంతో విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి చిత్తూరులో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంఘిక, మైనార్టీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇక్కడ ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తున్నామన్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, అట్లూరి శ్రీనివాసులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



టీడీపీ నాయకులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎగువతడకర నుంచి పల్లెచెరువు వరకు నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే మురళీ మోహన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పల్లెచెరువు నుంచి కారకాంపల్లె లింక్‌రోడ్డు వరకు పెండింగ్ ఉన్న కిలోమీటరు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి కలెక్టరుతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి, తవణంపల్లె, ఐరాల మండల అధ్యక్షులు గాలి దిలీప్, గిరిధర్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, పీఆర్ డీఈ ప్రసాద్‌నాయుడు, ఏఈ జయచంద్రారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా: ఎమ్మెల్యే

శ్రీరంగరాజపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటానని జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ అన్నారు. శుక్రవారం ఎస్‌ఆర్‌పురంలో టీడీపీ యువ నేత జయరాజ్‌కు చెందిన ఇంటర్నెట్ షాపును ప్రారంభించారు. కట్టికపల్లెలోని సమస్యలను జిల్లా తెలుగు యువత కార్యదర్శి శేఖర్ ప్రస్తావించగా, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రుద్రప్పనాయుడు, రవికుమార్, గురునాథం, రాజశేఖర్ నాయుడు, వేమనాయుడు, పైనేని మురళి, మునివర్ధనాయుడు, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

వెదురుకుప్పం, మే 9 (ఆంధ్రజ్యోతి): చిన్నమరెడ్డికండ్రిగలో శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపం, భజనలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, ప్రధాన కార్యనిర్వాహకుడు మిట్టపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి పర్యవేక్షించారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● అధికారులకు ఎమ్మెల్యే జగన్మోహన్ సూచన

చిత్తూరు సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కరించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి 66 అర్జీలు అందాయి. మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం: మురళీమోహన్

ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి 74 అర్జీలు వచ్చాయన్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై 12న యూటీఎఫ్ నిరసన

చిత్తూరు సెంట్రల్, మే 9 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సమస్యలపై ఈనెల 12వ తేదీన డీఈవో కార్యాలయం ముందు యూటీఎఫ్ నిరసన చేపట్టనుంది. ఈ మేరకు శుక్రవారం యూటీఎఫ్ నాయకులు రమణ, సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, తదితరులు కలెక్టరేట్‌లో డీఆర్వో మోహన్, డీఈవో కార్యాలయంలో డీఈవో వరలక్ష్మిలకు సమ్మె నోటీసులు ఇచ్చారు. విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రక్రియ, స్పష్టత లేని జీవోలతో పాటు రోజుకో ఆలోచన చేయడంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే నిరసన బాట పట్టనున్నట్లు చెప్పారు. అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చిన వారిలో నాయకులు బాషా, ఏకాంబరం, రెడ్డెప్ప, పార్థసారథి, సర్దార్ తదితరులు ఉన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆపరేషన్ పరిధిలో 33, 11కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. పూతలపట్టు మినహా యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు విద్యుత్‌సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే చిత్తూరు టౌన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

శ్రీకృష్ణ భజన మందిర కుంభాభిషేకం

చిత్తూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని అలుకూరపల్లెలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ భజన మందిర మహాకుంభాభిషేకం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరవగా, నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, జయచంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ సునీత, నీలకంఠం నాయుడు, గిరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు పొంగళ్లు



ముత్యాలమ్మ, పొన్నియమ్మన్ ఆలయాల వద్ద పొంగళ్లు సిద్ధం చేస్తున్న మహిళలు

చిత్తూరు కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగమ్మ జాతర సందర్భంగా పలు ఆలయాల్లోని అమ్మవార్లకు శుక్రవారం భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. పొన్నియమ్మ ఆలయంలో నడివీధి గంగజాతర వంశపారంపర్య ధర్మకర్త సీకే లావణ్య తట్టవాయనం తీసుకొచ్చి, ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, దీపారాధన చేశారు. తేనెబండ ముత్యాలమ్మ, కొంగారెడ్డిపల్లె శక్తి మారియమ్మ ఆలయాల్లోనూ భక్తులు పొంగళ్లు పెట్టారు. గిరింపేట దుర్గాంబ ఆలయ ఉత్సవ మండపంలో దీపారాధన చేశారు. ఈ కార్యక్రమాల్లో ముత్యాలమ్మ, దుర్గాంబ ఆలయాల ఈవోలు వెంకటరాయలు, మునిశేఖర్, నడివీధి గంగజాతర వంశపారంపర్య నిర్వాహకుడు సంపత్ కుమార్, కొంగారెడ్డిపల్లె నడివీధి గంగజాతర నిర్వాహకుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలి: కమిషనర్



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంగజాతర సందర్భంగా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. జాతర జరిగే బజారువీధి, గిరింపేట, సంతపేట, మురకంబట్టు, పాంచాలిపురం, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, దొడ్డిపల్లె ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని చెప్పారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గ్రామీణుల సమస్యల పరిష్కారానికి కృషి: ప్రభుత్వ విప్ థామస్

గంగాధరనెల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల ముంగిటకు వెళ్లి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం కొండేపల్లె పంచాయతీ పోలినాయుడుపల్లెలో సిమెంట్‌రోడ్డును, పద్మాపురం బస్టాప్ వద్ద టీడీపీ దిమ్మెను, పాపిరెడ్డిపల్లె పాఠశాల ఆవరణంలో రైల్వే కాంట్రాక్టర్, టీడీపీ నేత పోలు రుషేంద్రరెడ్డి సహకారంతో రూ.2.50లక్షలతో ఏర్పాటుచేసిన ఇండోర్ క్రికెట్ కోర్టును, పెడకంటిపల్లె హైస్కూల్లో రూ.1.50లక్షలతో నిర్మించిన మీటింగ్ స్టేజీని తన సతీమణి శాంతారెడ్డి, కుమారులు రోషన్, రాహుల్, పలువురు టీడీపీనేతలతో కలిసి ప్రభుత్వ విప్ ప్రారంభించారు. తర్వాత పెడకంటిపల్లెలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సీఐ విక్రమ్ తమ కుటుంబాలను పోలీసు కేసుల్లో అక్రమంగా ఇరికించి కొన్నేళ్లుగా వేధింపులకు గురిచేస్తున్నారని సర్విరెడ్డిపల్లెకు చెందిన బాలిరెడ్డి, బాబురెడ్డి కుటుంబీకులు విన్నవించారు. స్పందించిన థామస్ వెంటనే ఎస్పీకి ఫోన్‌చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఎస్పీతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలినాయుడుపల్లెకు చెందిన వైసీపీ నేతలు లెక్కలపూడి రాజేష్, గుండాల మధు థామస్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, ఉమేషరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, యాగమరెడ్డి, జ్యోతిరెడ్డి, మునిరాజులు యాదవ్, హరీష్ యాదవ్, మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లోకేష్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, మండల ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసులు, వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి రజని, పలువురు సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



పాపిరెడ్డిపల్లె పాఠశాల ఆవరణంలో ఇండోర్ క్రికెట్ కోర్టును ప్రారంభించి సరదాగా బ్యాటింగ్ చేస్తున్న థామస్

మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేద్దాం

● డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి



చిత్తూరు సెంట్రల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేద్దామని డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సెర్ప్ ఉద్యోగులు, ఏపీఎం, సీసీ, ఎస్‌హెచ్‌జీలకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికలను మైక్రో క్రెడిట్ ప్లాన్‌గా మార్చే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సెర్ప్ సీఈవో ఆదేశాలతో గత నెలలో జిల్లా వ్యాప్తంగా 35వేల సంఘాల్లోని 3.50 లక్షల మంది సంఘ సభ్యుల వార్షిక రుణ అవసరాలను యాప్ ద్వారా గుర్తించామన్నారు. దీనికి సమాంతరంగా వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ చేయడంలో భాగంగా విమెన్ లెడ్ ఎంటర్‌ప్రెన్యూర్ రుణాలను బ్యాంకుల ద్వారా ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు జడ్‌ఎం మోహన్, బీఎం మురళీకృష్ణ, సిబ్బంది రవికుమార్, మధు పాల్గొన్నారు.

లారీ బోల్తా : డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలు



శ్రీరంగారజపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): లారీ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం చెన్నై నుంచి చిత్తూరుకు రుచి ఆయిల్ లోడుతో వెళ్తున్న లారీ మార్గమధ్యంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై ఎస్‌ఆర్‌పురం మండలంలోని ఒడ్డుపల్లె సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

'స్కిల్ ఆఫ్ డిజిటల్'పై రైతులకు శిక్షణ

బంగారుపాళ్యం, మే 9 (ఆంధ్రజ్యోతి): స్కిల్ ఆఫ్ డిజిటల్‌పై తుంబకుప్పం రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పర్యవేక్షణాధికారి యామిని, ట్రైనర్ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

ఐరాల: కామినియనపల్లె, ఇరువారంపల్లె ఆర్‌ఎస్కేలలో జరిగిన కార్యక్రమంలో టీవీఎస్ రజని, వీహెచ్‌ఏలు రామచైతన్య, మురళీకృష్ణా, మాస్టర్ ట్రైనర్లు హేమంత్, ఆనందరాజ్, రైతులు పాల్గొన్నారు.

పెనుమూరు: కలవగుంట రైతు సేవాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న, వీహెచ్‌ఏ సంధ్య, సర్పంచ్ రామచంద్రభూపతి, రైతులు పాల్గొన్నారు. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ.. వ్యవసాయానికి ఉపయోగపడే అగ్రి సెంట్రల్, ప్లాంటిక్స్, ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ల వినియోగాన్ని తెలియజేశారు. అలాగే డిజిటల్ పేమెంట్స్‌తోపాటు వాతావరణ వివరాలు, ధాన్యం రేట్లు, పంటలకు ఎప్పుడు ఏ మందులు వాడాలో తెలుసుకోవడంపైనా రైతులకు ఆమె అవగాహన కల్పించారు.

గజ బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు

కల్లూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల గుంపు దాడుల్లో పంటలను నష్టపోతున్న బాధిత రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు కోరారు. పులిచెర్ల మండలం రాయవారిపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రెండేళ్ల క్రితం మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పలు దఫాలుగా పంటలను ధ్వంసం చేయడం పరిపాటిగా మారిందన్నారు. దీంతో అటవీ ప్రాంతం సరిహద్దులోని రైతాంగం వ్యవసాయంపై ఇప్పటికే ఆశలు వదిలేసుకున్నారని తెలిపారు. బాధిత రైతులకు అటవీశాఖ తూతూమంత్రంగా నష్ట పరిహారం చెల్లిస్తుండటం బాధాకరమన్నారు. పంటలపై ఏనుగుల దాడులను నివారించడంలో అటవీశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కోతులు, అడవిపందులు ఒక వైపు పంటలను ధ్వంసం చేస్తుంటే మరో వైపు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని వాపోయారు. ఏనుగుల గుంపును కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 10 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు తెలిపారు. బుధ, గురువారాల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. 10మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం వీరిని కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. విచారించిన ఆమె నిందితులు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని సీఐ పేర్కొన్నారు.

జూద స్థావరంపై దాడి: 9 మంది అరెస్టు

వెదురుకుప్పం, మే 9 (ఆంధ్రజ్యోతి): జక్కిదొన అటవీప్రాంతంలో జూదస్థావరంపై శుక్రవారం ఎస్‌ఆర్‌పురం ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌పురం, వెదురుకుప్పం పోలీసులు దాడులు నిర్వహించారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.15,830 స్వాధీనం చేసుకున్నారు.

గర్భిణులకు హెచ్‌ఐవీ పరీక్షలు చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న కోటిరెడ్డి

బంగారుపాళ్యం, మే 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు తప్పని సరిగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయాలని ఐసీటీసీ జిల్లా క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యంలోని ఐసీటీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో ఎంతమంది హెచ్‌ఐవీ పరీక్షలు చేసుకున్నారు.. అందిస్తున్న వైద్యసేవలపై కౌన్సిలర్ బాబుతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌ను, స్టాక్‌ను, రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

పాలసముద్రం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 53 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 17 మంది హైరిస్క్‌లో ఉన్నట్లు గుర్తించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఎండల కారణంగా గర్భిణులు బయట తిరగవద్దని వైద్యాధికారి మోహన్‌కృష్ణ సూచించారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



చిత్తూరు వెంగళరావుకాలనీ అంగన్వాడీ కేంద్రంలో బాలికలతో సమావేశమైన కానిస్టేబుల్ సునీత తదితరులు

చిత్తూరు అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నేరమని కానిస్టేబుల్ సునీత తెలిపారు. శుక్రవారం నగరంలోని 8వ డివిజన్‌లోని వెంగళరావు కాలనీ అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం అరుణ, అంగన్వాడీ టీచర్ చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని గంధపుపొడివాండ్లవూరు ఎంపీపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ట్రైనర్ అఫ్రీన్, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, బాలికలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని శివాలయం వీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద, అంగన్వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయండి

వరసిద్ధుడి ఆలయ ఉద్యోగులకు ఈవో సూచన

ఐరాల(కాణిపాకం), మే 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని ఉద్యోగులంతా అంకిత భావంతో పనిచేయాలని ఈవో పెంచల కిషోర్ సూచించారు. శుక్రవారం ఆలయ ఆస్థాన మండపంలో అన్నిశాఖల అధికారులు, అర్చక, వేదపండితులు, సిబ్బందితో సమీక్షించారు. భక్తులతో, విరాళాలు ఇచ్చే దాతలతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సిబ్బందికి తెలిసినవారు దర్శనార్థం వస్తే తప్పనిసరిగా దర్శన టికెట్ కొనుగోలు చేసే ఆలయంలోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ప్రొటోకాల్ ఉన్నవారికి, ఆలయ ఉభయదారులు, వారి కుటుంబీకులకు తప్ప మిగిలిన వారెవరైనా కచ్చితంగా టికెట్లు కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చారు. స్వామి దర్శన విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలయాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిబ్బందికి ఇబ్బందులుంటే తన దృష్టికి తేవాలని, భక్తులను గణేశ అని సంబోధిస్తే వారుకూడా స్వామి నామస్మరణ చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ఈఈ వెంకటనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖరగురుకుల్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ధనంజయ, ప్రసాద్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.73 లక్షల విరాళం

వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,11,116, అన్నదాన కార్యక్రమానికి రూ.62,000లను హైదరాబాదుకు చెందిన బాలాజీవెంకటేశ్వర్లు అందించారు. అలాగే గోసంరక్షణ ట్రస్టుకు రూ.50,116, అన్నదాన కార్యక్రమానికి రూ.50,116లను సత్యనారాయణ, రమాదేవిలు విరాళమిచ్చారు. దాతలకు ఏఈవో రవీంద్రబాబు దర్శన ఏర్పాట్లను చేశారు.

సంక్షిప్తంగా..

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బంగారుపాళ్యం, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలకు మండలంలోని ఎస్సీ కులాలకు చెందిన యువతీ యువకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీధర్ శుక్రవారం తెలిపారు. అర్హులైనవారు రెండు సెట్ల దరఖాస్తు ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు

వెదురుకుప్పం, మే 9 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేశం రవియాదవ్ పర్యవేక్షించారు.

శ్రీకృష్ణ ఆలయ కుంభాభిషేకం

ఐరాల, మే 9 (ఆంధ్రజ్యోతి): పొలకలరెడ్డివారిపల్లె ఎస్సీ కాలనీలో శ్రీకృష్ణ ఆలయ కుంభాభిషేకాన్ని శుక్రవారం నిర్వహించారు. వేడుకలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పొలకల పంచాయతీ ఉప సర్పంచ్ బత్తలసురేంద్రనాయుడు, టీడీపీ యువనేత ముత్తిరేవుల లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



చిత్తూరు కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ కార్యాలయంలో జరిగిన వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు జరిగాయి. వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విజయం పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుచున్న అఫ్రీన్ నవాజ్ ఖాన్‌ను రెడ్ క్రాస్ ప్రతినిధులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి రెడ్డి, మోహన్, సహదేవనాయుడు అభినందించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు.

మాస నారాయణి సేవ పూజలు

చిత్తూరు కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో శుక్రవారం మాస నారాయణి సేవ పూజలను నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, ఆర్.శేషనారాయణ, సత్యనారాయణ, గజేంద్రరెడ్డి, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పూతలపట్టు, మే 9 (ఆంధ్రజ్యోతి): నొచ్చుపల్లె గ్రామ సమీపాన ఉన్న బల్లారి కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకీలో ఊరేగించారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, ఎల్పీఐ అధినేత, టీడీపీ యువనేత లోకేశ్ రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, దుబాయి నరసింహులు, జగన్నాథం, రెడ్డెప్ప రెడ్డి, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరం ఎస్‌ఐ బదిలీ

వెదురుకుప్పం, మే 9 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్‌ను తిరుపతి సీబీడీ కార్యాలయానికి బదిలీ చేశారు. శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



బంగారుపాళ్యం, మే 9 (ఆంధ్రజ్యోతి): లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడానికి తగ్గువారిపల్లె పంచాయతీలో అదనంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏడీ కొండయ్య, ఏఈ దేవీప్రసన్న శుక్రవారం తెలిపారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు హేమచ్ఛందనాయుడు, ఉపసర్పంచు లోకనాథనాయుడు, రూరల్ ఏఈ శశాంత్, సీనియర్ అసిస్టెంట్ సునీలా, లైన్‌మెన్ నాగరాజ, సిబ్బంది పాల్గొన్నారు.